# సంసారంలో సరిగమలు

'హేపీ న్యూ ఇయర్' అంటూ చెప్పిన వాళ్ళకే మళ్ళీ చెప్తూ, ఉత్సాహంగా ఆనందంగా సంతోషంగా, స్నేహితురాండ్రందరితో సరదాగా, నవ్వుతూ తుళ్ళుతూ కబుర్లు చెప్పి, గాలిలో అలా అలా తేలిపోతూ శ్యామల ఇంటిముఖం పట్టేటప్పటికి మధ్యాహ్నం రెండు దాటింది. తన ఆనందాన్ని అందరికీ పంచాలనీ అందరి ఆనందం తనదిగా చేసుకోవాలనే తహ తహే తప్ప, ఆమెకి ఇంతవరకూ, ఆలస్యం అవుతోందనిగానీ, అక్కడ దినకర్రావు ఒక్కడూ ఇంట్లో ఉండిపోయాడని గానీ, ఆలోచనే రాలేదు శ్యామలకి.

కూనిరాగం తీస్తూ గడపలో అడుగు పెట్టిన శ్యామలకి భర్త ముఖం చూసేటప్పటికి భయం వేసింది. నవ్వుతూ 'డార్లింగ్' అంటూ ఎదురు రావలసిన దినకరరావు పుల్లూ పుల్లూ చూస్తూ కోపంగా నుంచున్నాడు, డాయింగ్ టేబిల్ కి ఆనుకొని.

ఒక్క క్షణం గతుక్కుమని వెంటనే చిరునవ్వు చిందిస్తూ, "అదేవిటి డార్లింగ్! ఎంతో సరదాగా నేను వస్తే, నా మూడ్ అంతా పాడుజేస్తూ నువ్వు మూడీగా...." అంటూ శ్యామల ఇంకా వాక్యం పూర్తిచేసిందో లేదో, దినకరరావు గయ్‌మన్నాడు.

"నీకు పెళ్ళి అయిందనీ, ఈ మొగుడుగాడికి కాస్త అన్నం వండిపడెయ్యాలనీ నీకు గుర్తుందా? పొద్దున్ననగా చెప్పు అట్టలాంటి రెండు బ్రెడ్ ముక్కలు నా మొహాన కొట్టి అదేపోత పోయావు!"

ఆ కేకలకి అదిరిపోయింది శ్యామల. శరీరం, శరీరంతోబాటు మనస్సూ సుకుమారమైనవేమో, శ్యామల గుండె దడదడ లాడింది. చేతిలో హేండ్‌బేగ్ పట్టుతప్పి కిందపడిపోయింది. నుదురంతా చెమట పట్టేసింది. హడలిపోయి బెదురు చూపులు చూస్తూ అవాక్కయి అమట్టున ఉండిపోయింది శ్యామల.

ఆమె నా స్థితిలో చూసేసరికి దినకరరావు గుండె జాలితో నిండిపోయింది. దగ్గరగా తీసుకుని సముదాయిద్దాం అనుకున్నాడు. కాని, వెంటనే 'ఈ జాలే

కొంపముంచుతోంది. కాస్తంతైనా భయం భక్తి లేకుండా చేస్తోంది' అనుకున్నాడు అనుకొని—

"ఏం లాభం లేదు. మొన్నటికి మొన్న మూడు రోజుల క్రితం, చెప్పా పెట్టకుండా సినిమాకి వెళ్ళిపోవడమా? అంతకు ముందు మంగళవారం నాడు అలసిసొలసి ఆఫీసునుంచి వస్తే 'మీ శ్రీమతి గారు పేరంటానికి వెళ్ళారంటూ' పక్కింటావిడ తాళం చెవి నా మొహాన్న పడెయ్యడమా? ఒక రోజు షాపింగ్‌కా? ఇంకోరోజు స్నేహితురాలి ఇంటికా? చాలా బాగుంది కదూ కాపురం?"

దినకర్రావు అలా అరిచేసరికి నిలువెల్లా వణికిపోయి, రెండు చేతుల్తోటి ముఖం కప్పుకొని భోరుమంటూ ఏడ్చేసింది శ్యామల.

అనుకోని ఆ హఠాత్పరిణామం చూసేసరికి కంగారుపడ్డాడు దినకరరావు. కాని, తనలో రేగిన సంచలనాన్ని కన్పించనీయకుండా గబగబా ప్రక్క గదిలోకి వెళ్ళి తలుపు చప్పుడు చేస్తూ "ఊహు! ఈ బుడి బుడి దీర్ఘాలకి నేను కరిగిపోతా ననుకుంటున్నావ్. అదేం లాభంలేదు" అన్నాడు.

శ్యామలకి అవమానం అయిపోయింది.

తను ఏడుస్తూంటే దగ్గరగా వచ్చి లాలించి బుజ్జగించడం అట్టేపోయి, ఆ రెచ్చిపోవడం ఏమిటి? తను ఇంకో గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది.

ఎవరి లోకాల్లో వాళ్ళు, ఎవరి పట్టుదలల్లో వాళ్ళు ఉండిపోయారు. ఆ మధ్యాహ్నం సరే - రాత్రి కూడా ఎవరూ భోజనం చెయ్యలేదు ఎవరిగది దాటి వాళ్ళు బయటికి రాలేదు ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోలేదు.

రాత్రి పదిగంటలకి, కావాలని, శ్యామల వినాలని, ఫోన్‌లో గట్టిగా మాట్లాడసాగాడు దినకరరావు. "మీతోటి అర్జంటుగా మాట్లాడాలి,వెంటనే బయలు దేరి రండి." మాట్లాడింది ఎవరితోటో శ్యామలకి అర్థమైంది.

నాన్నగారికి ఫోను చేస్తున్నాడంటే - తనని పుట్టింటికి పంపించెయ్యాలనే. ఆవేశం - ఆవేదనా-ఉక్రోషం-భరించరాని అవమానంతో ఊగిపోయింది శ్యామల

తల నరాలన్నీ కరకరమన్నట్లు కదిలిపోయి, ఒక్క మారుగా మెదడంతా బరువెక్కి మొద్దుబారిపోయింది. లాలనగా దగ్గరికి పిలిచి కళ్ళతో కవ్వించి ఛలోక్తులతో మురిపించి, కన్నవారిని మరిపించి, పూర్తిగా తనదాన్ని చేసుకోవల సిన భర్త. ఇలాగేనా ప్రవర్తించడం? చిన్న పొరబాటుని సర్దుకోలేడా? ఈ మాత్రం

దానికి నాన్నగారికి ఫోను చేస్తాడా? తమ మధ్య ఉండిపోవలసిన కోపతాపాల్నీ పట్టుదలల్నీ పదిమందికి వెల్లడిచెయ్యడమా? అందులో ఎవరికి తెలియకూడదో వారికా? ఈ వయస్సులో నాన్నగారికి ఇలాంటి విషయాలు తెలిస్తే ఆయన తట్టుకోగలరా?

శ్యామల మనస్సులో కట్టలు తెగి పొంగబోయే దుఃఖం కాస్తా కోపంగా మారి, చివరకి అది అభిమానంగానూ పౌరుషంగానూ రూపుదిద్దుకొని, ఆఖరికి 'సరే కానియ్యి' అనే పట్టుదలగానూ నిర్లక్ష్యంగానూ ఘనీభవించింది. శ్యామల ఇలా భీష్మించుకుని కూర్చుంటే దినకర్‌రావు అంతకంటే మొండిగా ఉండి పోయాడు.

మొదట్లో మెత్తబడ్డాడు.

పోనిద్దూ - పెద్ద తప్పేం చేసింది కనక? వెళ్ళి పలకరించి 'సర్లే - ఇక ముందు ఇలా ఉండకు' అని పరిస్థితిని చక్కదిద్దేసి ఇంట్లో తిరిగి ప్రశాంత వాతావరణం నెలకొనేలా చేద్దాం అనుకున్నాడు. శ్యామల కిలకిలా నవ్వుతూ ఇంట్లో తిరుగుతూ ఉంటే కాని తనకు తోచదు. అందుకని....అందుకని? వెళ్ళి బతిమాల్తాడా? అదిగో, అలా చేసే లోకువ ఇచ్చాడు ఇంతవరకూ? ఈ మాట యినా కాస్త బింకంగా ఉండాలి. బొత్తిగా భయభక్తులు లేకపోతే ఎలా?

అంతే. ఇలా ఆలోచించి బింకంగా ఉండిపోయాడు దినకరరావు.

ఆ రోజు మౌనంగానే గడిచింది ఇద్దరిమధ్యా. మర్నాడు కూడా వాళ్ళు మాట్లాడుకోలేదు. వాళ్ళబదులు ఇంట్లో వస్తువులు మాట్లాడసాగాయి.

'కాఫీ రెడీ' అనే సందేశాన్ని, కాఫీ గ్లాసుని గట్టిగా టేబుల్‌మీద పెట్టడం ద్వారా శ్యామల అందిస్తే, "నేను ఆఫీసుకు వెళ్తున్నాను, తలుపు వేసుకో" అనే కబురుని, దినకరరావు చెప్పులు చప్పుడు చెయ్యడం ద్వారా, స్కూటర్ స్టార్ట్ చేసి, యాక్సిలేటర్‌ని అవసరాన్ని మించి ఎక్కువ రైజ్ చెయ్యడం ద్వారా తెలియ పర్చాడు.

'సారీ' చెప్పి మాట్లాడేద్దాం అంటే వ్యక్తిత్వం అడ్డువచ్చింది శ్యామలకి.

పలకరిద్దాం అంటే పురుష అహంకారం ఒప్పుకోలేదు దినకరరావుకి.

మూడోనాడు శ్యామల తల్లీతండ్రీ వచ్చేదాకా మౌనపోరాటం ఇలా సాగుతూనే వుంది ఇద్దరిమధ్యా.

తండ్రిని చూసి బావురుమంది శ్యామల.

'ఏనిటా ఏడుపులూ పెడబొబ్బలూను' అంటూ అరిచాడు దినకరరావు.

శ్యామల తల్లిదండ్రులిద్దరూ నివ్వెరపోయారు.

చిలకా గోరింకల్లా ఉండాల్సిన కూతురూ అల్లుడూ ఇలా ఉన్నారేమిటి?

''ఏం జరిగింది?'' భయపడుతూ భయపడుతూనే అడిగాడు శ్యామల తండ్రి.

"'ఏం జరక్కూడదో అదే జరిగింది. ఎక్వేరియంలో చేపల్లేవూ? ఒకేచోట ఉంటాయి. కానీ, వేటికవే తిరుగుతూ ఉంటాయి. అలా ఉంది మా కాపురం. అయినా, మీ అమ్మాయిని మీరు పెంచిన విధానం మంచిది కాదు. మా చెల్లెళ్ళని మేమూ పెంచాం. వాళ్ళు ఇలా ఉన్నారా?''

శ్యామల ఎలా ఉందో, ఎలా ఉండాలో, కోపంలో దినకరరావు విడమర్చి చెప్పలేదు. అందువల్ల శ్యామల తల్లితండ్రులకి అసలు జరిగిన విషయం తెలియలేదు. 'పోనీ నువ్వేనా చెప్పవే తల్లీ!' అని అడిగిన తల్లితండ్రుల మీద తాడి ఎత్తున లేచింది శ్యామల. ''నన్ను అడుగుతారేమిటి? ఫోన్ చేసింది నేనా? అయినా చెయ్యని తప్పుకి ఈ రాద్ధాంతం ఏవిటి? నా వ్యక్తిత్వాన్ని గౌరవించని చోట నేను ఒక్కక్షణం ఉండను. తీసికెళతారా మీతో నన్ను తీసికెళ్ళండి. లేదా నా దారి నేను చూసుకుంటాను" అంది.

శ్యామల తల్లీ తండ్రీ అదిరిపడ్డారు.

''ఏం జరిగింది?'' అని అడిగారు. బ్రతిమాలారు. బామాలారు. శ్యామలా చెప్పలేదు. దినకరరావూ చెప్పలేదు ఏం జరిగిందో.

ఎంతసేపటికీ. నేనిక్కడ ఉండనని శ్యామలా, అవిడిష్టం వచ్చినట్లు ఉండే మాటయితే ఇక్కడ ఉండక్కర్లేదని దినకరరావూ.

ఇంతకు మించి ఒక్కమాట రాబట్టలేక పోయారు వాళ్ళ దగ్గర్నుంచి ఆ వృద్ధదంపతులు.

ఆగ్రహాలూ ఆవేశాలూ తగ్గాక అసలు విషయం తెలుసుకుని పరిస్థితి చక్కదిద్దవచ్చు అనే ఆలోచనతో, పిల్లని పుట్టింటికి తీసుకువెళ్ళిపోయారు శ్యామల తల్లీ తండ్రీను, 'త్వరలో పంపిస్తాం' అని అల్లుడికి చెప్పి.

అలా అని తీసుకువచ్చారే కాని, అన్నప్రకారం శ్యామలని త్వరలో పంపించలేకపోయారు ఆమె తల్లీ తండ్రీను.

అందుకు కారణం శ్యామల పట్టుదల కొంత దినకరరావు దగ్గరనుంచి రమ్మని కబురు రాకపోవడం కొంతాను.

రోజురోజూ గడిచి క్రమంగా నెల అయింది.

ఒకటి....రెండు....నెలలు గడుస్తున్నాయి.

సమస్య పరిష్కారం కాలేదు.

అటు దినకరరావులోకానీ ఇటు శ్యామలలోకానీ పౌరుషాలూ, పట్టింపులూ, పంతాలూ అవంతయినా తగ్గలేదు.

జరిగింది చూచాయగా తన తల్లితండ్రులకి తెలియపర్చాడు దినకరరావు. దానికి వాళ్ళు అతనినే చివాట్లు పెడుతూ 'చిన్న చిన్న పట్టింపులకి పోకుండా వెళ్ళి కోడల్ని తీసుకురా' అని సమాధానం రాశారు. వీళ్ళు కూడా శ్యామలనే సమర్థిస్తారేమిటి? దినకరరావుకి చిరాకేసింది.

పొద్దుటే లేచి కాఫీ పెట్టుకోవడం, హోటల్లో భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళి సాయంత్రం ఇంటికి రావడం - ఇంట్లో వంటరిగా కాలక్షేపం. రాత్రి పది అయినా నిద్రపట్టకపోవడం. టీవీ చూడాలంటే విసుగు - పోనీ, ఏదైనా పుస్తకమో చదివి తిరిగేద్దామంటే చిరాకు - రోజులు గడిచినకొద్దీ వంటరి జీవితం బోరు కొట్టసాగింది.

'కబుర్లు చెప్పుకున్నా కజ్జా పెట్టుకున్నా, శ్యామల ఉన్నప్పుడు రోజు ఇట్టే గడిచిపోయేది. ఇప్పుడు గంట గడవడం గగనం అవుతోంది. ఆదివారం వస్తే మరింత విసుగు. ఆఫీసు ఉండదు. ఏ స్నేహితుడి ఇంటికేనా వెళితే అతగాడు పెళ్ళాంతో ఇంచక్కా ముచ్చట్లు ఆడుతూ ఉంటాడు. మధ్యలో పానకంలో పుడకలాగా తను....ఎక్కడికీ వెళ్ళడం మానుకున్నాడు. ఇంట్లో తోచి చావడంలేదు.

ఓ రోజు సాయంత్రం స్నానం చేసి లాల్చీ పైజామా తొడుక్కుని హవాయ్ చెప్పులు వేసుకుని పార్కుకి వెళ్ళాడు. అక్కడ పిల్లలంతా గుంపులు గుంపులుగా ఆడుకుంటున్నారు. ఓ కుర్రాడు మాత్రం ఎవరితోటీ కలవక జారుడు బల్ల ఎక్కి జారుతున్నాడు.

మళ్ళీ ఎక్కుతున్నాడు -

మళ్ళీ జారుతున్నాడు....

కాస్సేపయ్యాక విసుగొచ్చింది కాబోలు చొక్కా విప్పి అందులోకి ఇసుక తీసుకున్నాడు. ఆ ఇసుక తీసుకెళ్ళి దూరంగా పోశాడు. మళ్ళీ వచ్చాడు - మళ్ళీ చొక్కా నిండా ఇసుక నింపుకున్నాడు. ఇలా అయిదారుసార్లు చేసి చేసి చివరికి చొక్కా అక్కడ చుట్టచుట్టి పడేసి, కాళ్ళుజాపుకుని ఆకాశం కేసి చూస్తూ కూచున్నాడు ఒక్కడూ.

ఆ కుర్రాడిని చూస్తే తన పరిస్థితి అర్థమైంది దినకరరావుకి. వాడిలాగే వుంది తాను స్థితీను. లాభంలేదు పౌరుషం ఏమిటి? తన భార్యని తను తెచ్చుకో డానికి నామర్దా ఏమిటి?

ఓ నిశ్చయానికి వచ్చి దినకరరావు లేచాడు....

అక్కడ పుట్టింట్లో అమ్మా నాన్నా దగ్గర ఉన్నా శ్యామలకి కూడా ఏకాంతంగా ఉన్నట్లే అనిపిస్తోంది. ఎంత సేపటికి కిటికీ దగ్గర కూర్చుని బటియకి అలా చెట్లకేసి చేమలకేసీ పక్షులకేసీ చూస్తూ ఉండడం. తోచకపోతే ఏ స్నేహితురాలింటికో వెళ్ళడం. అంతగా విసుగేస్తే పేపర్లో కనిపించిన ఏ అడ్వర్టైజ్‌మెంట్‌కో జవాబుగా ఉద్యోగానికి దరఖాస్తు పడెయ్యడం. గంటలు గంటలు మంచం మీద వెల్లకిలాపడుకుని గోడలకి వేళ్ళాడుతూన్న ఫోటోల్ని, నోట్లో గడ్డిపరకలు కరుచుకుని గదిలోకి వచ్చిపోతూ గలాభా చేస్తూన్న పిచికల్ని చూస్తూ ఉండడం.

ఓనాడు కిటికీలోంచి చూస్తే మావిడి చెట్టుని అల్లుకోవడానికి తీగలు దాస్తూన్న మాధవీలత కనిపించింది. మరోనాడు నిలువెల్లా పులకించినట్లు ఒత్తుగా పూతతో మామిడి చెట్టు - ఇంకోనాడు ఒకదాన్ని ఒకటి తరుముకుంటూ మామిడి చెట్టుమీద గంతులేస్తూన్న రెండు ఉడుతలు.

బయట ఉడుతలు -

ఇంట్లో పిచ్చికలు -

ఆలోచనలు తెగనీయకుండా ఏకరొద చేస్తూ గెంతుతూ - ఎగురుతూ - వాటిని చూస్తే ముచ్చటా వేసింది, బాధా కలిగింది శ్యామలకి.

ఓ రోజు ఏం తగాదా వచ్చిందో ఉడుతలు పెద్ద అల్లరి చేస్తూ ఒకదాన్ని ఒకటి తరుముకుంటున్నాయి.

ఇవి కూడా తనలాగా దినకరరావులాగా తగాదా పడ్డాయా? శ్యామలకి నవ్వు వచ్చింది. అంతలోనే ముఖం విషాదంగా మారింది. చాలా సేపు ఏవేవో ఆలోచనలు వస్తే వాటిలో మునిగిపోయింది.

ఆలోచనల్లోంచి తేరుకొని అటుచూసేసరికి - తగాదా మాని, ఆ ఉడుతలు రెండూ ఎక్కడినుంచో ఓ పచ్చిజామకాయ తెచ్చుకుని, కాళ్ళతో నొక్కిపట్టుకుని ఒకే జామకాయని అటు అదీ, ఇటు ఇదీ కొరుక్కు తింటున్నాయి.

మరి ఇందాకటి తగాదా ఏమైంది ఈ ఉడుతలకి - ఇప్పుడింత పొత్తుగా ఉన్నాయి?!

"అమ్మాయీ! ఏదో కవరు వచ్చిందమ్మా నీ పేరవి." శ్యామల తండ్రి వరండాలోంచి కేకేశాడు. ఉత్తరమా? దినకరరావు దగ్గర్నుంచి కాదు కదా! ఎగిరి గంతేసి ఒక్క పరుగున వెళ్ళింది గంపెడాశతో. ఆశలన్నీ కుంగిపోయి నిరాశగా కూర్చున్న కూతుర్నిచూసి, ముసలి దంపతులిద్దరూ ఆదుర్దాగా "ఏమైందే తల్లీ! ఎక్కడ నుంచి ఆ కవరు?" అన్నారు.

శ్యామల జవాబు చెప్పలేదు.

వాళ్ళిద్దరూ మొహ మొహాలు చూసుకున్నారు.

తర్వాత శ్యామల తల్లి, పైటతో కళ్ళు ఒత్తుకుంటూ "ఏవిటో, పిల్ల పరిస్థితి చూస్తే బెంగవస్తోంది. వచ్చి మూడు నెలలు దాటుతున్నా అతగాడు రమ్మనడు. ఇది వెళ్ళదు. మీరూ పట్టించుకోరు అంది.

''ఏం పట్టించుకోమంటావు? అతగాణ్ణి కోరి చేసుకుంది. ఆర్నెళ్ల కాకుండా అలిగి వచ్చేసింది. పోనీ, అతనేమైనా దుర్మార్గుడో, జూదరో, వ్యభిచారో అయితే, ఇదేవిటి నాయనా అని నాలుగు చివాట్లు పెట్టి, మార్గంలో పెట్టి సంసారం చక్క బరుద్దుం రత్నంలాంటి కుర్రాడు. చూస్తూంటే వీళ్ళ తగాదాలో అతనిదేం తప్పు ఉందని నాకు తోచదు. ఇదే....''

''అవును తప్పంతా నాదే.... ఆయన రత్నం, నేనే మట్టిబెడ్డను - సరా?'' అంటూ గుడ్ల నీరు కుక్కుకుంది శ్యామల.

''ఆయన నిన్నిప్పుడు ఏమన్నారే? అయినా, నీకు పౌరుషం ఎక్కువే తల్లీ! పెళ్ళికాకముందు మమ్మల్ని కాల్చుకుతిన్నావు. ఇప్పుడతన్ని ఏదో బాధ పెట్టి ఉంటావు నీ పట్టుదలతో. అందుకే అతను నీతో వేగలేక....'' అంటూన్న తల్లికేసి తిరిగి ''అనండి.... అనండి.... అంతా నన్నే అనండి'' అని అరిచింది శ్యామల.

''చూశారా? దాని కేకలూ అల్లరీను. అయినా, దాన్ని అలా స్వేచ్ఛగా పెంచారు మీరు తప్పు మీది. నేను మొదటినుంచీ మొత్తుకుంటూనే వున్నాను. ఆ మీటింగులూ, స్నేహితులూ- ఆడపిల్లకి ఇవన్నీ ఏవిటండీ అంటే విన్నారా?''

''ఊరుకో. ఆడపిల్ల అయినంత మాత్రాన స్వేచ్ఛగా పెరక్కూడదేవిటి? అయినా దానివల్ల వచ్చిన ఇబ్బంది ఏమిటి ఇప్పుడు? అదిసరేకానీ, ఆ కవ రేవిటమ్మా?'' అన్నాడు శ్యామల తండ్రి.

''నాకు ఉద్యోగం వచ్చింది నాన్నా!''

''ఎక్కడ? ఏమిటి ఉద్యోగం?''

''మీ అల్లుడుగారు పనిచేస్తూన్న ఊళ్ళోనే- ఆయన ఆఫీసులోనే'' అంటూ ఉత్సాహంగా తండ్రికి కవరు అందించింది శ్యామల.

ఆర్డర్ చదివి తలపంకించి 'ఇదీ ఒకందుకు మంచిదే' అనుకున్నాడు శ్యామల తండ్రి.

* * *

శ్యామలా, తండ్రీ, చిడీలు ఎక్కుతూన్నప్పుడు సరిగ్గా అప్పుడే ఇంటికి తాళం వేసి బయల్దేరబోతున్నాడు దినకరరావు.

''ఎక్కడికి నాయనా!''అని పలకరించాడు శ్యామల తండ్రి. పరధ్యానంగా ఉన్న దినకరరావు తలెత్తి చూసి, ఇది కలా నిజమా అని ఒక్క క్షణం విస్తుబోయి. ''ఎక్కడికేవిటండీ, మీ ఊరే బయల్దేరుతున్నాను-శ్యామల్ని తీసుకు వద్దాం అని'' అన్నాడు.

''నన్నేం తీసుకురానక్కర్లేదు - నేనే వచ్చేశాను'' అంది శ్యామల బుంగ మూతి పెట్టి కోపంగా.

ఆ రాత్రి గదిలోంచి వస్తూన్న పకపకలూ కిలకిలలూ విని పెద్ద భారం తీరినట్లు 'హమ్మయ్య' అని గుండె రాసుకున్నాడు శ్యామల తండ్రి.

మర్నాడు ఉద్యోగంలో చేరబోతూన్న కూతురు తల నిమురుతూ "వెర్రి పిల్ల. ఇంకివాళ నుంచి ఉద్యోగ బాధ్యత- స్నేహితులూ, సినిమాలూ, పార్టీలూ అంటూ ఎక్కడికి వెళ్ళడానికీ, ఆఖరికి పుట్టింటికి రావడానికి కూడా తీరిక ఉండదు'' అన్నాడు శ్యామల తండ్రి.

దానికి దినకరరావు నవ్వుతూ ''అదే మంచిదండీ! ఇంక ఇప్పటినుంచి తోచడం లేదంటూ స్నేహితులతో తిరగడం షాపింగ్ బయలుదేరడం ఉండదు. కాస్త ఇల్లూ భర్తా అంటూ ఇంట్లో ఉండడం...." అనబోతూంటే.

''ఆ....!మరే....మరే....తమరు కూడా కాస్త వీధి పెత్తనాలు తగ్గించి, ఇంటి పనిలో సాయం చెయ్యాలి'' అంది శ్యామల నవ్వుతూ.

''చేస్తాం.... చేస్తాం.... ప్రతి మనిషికీ చేతినిండా పనీ, బరువు బాధ్యతలూ ఉంటే బోర్ కొట్టదు. జీవితం అందంగా ఆనందంగా జరిగిపోతుంది....''

''నిజం.... అలా సంవత్సరాలు సుఖంగా గడిచిపోతాయి'' అన్నాడు శ్యామల తండ్రి.

''అప్పుడు ప్రతి యేటినీ హేపీన్యూ ఇయర్ అంటూ ఆహ్వానించవచ్చు." ఏమంటావు శ్యామలా?'' అంటూ కొంటెగా చూశాడు దినకరరావు శ్యామల కంటి చివర చిరుకోపం, అంతా పకపకా నవ్వుకున్నారు. *

(వనిత - '92 ఉగాది)